అరే లుచ్చా ఆడవాళ్ళ గదిలో జొరపడ్డావా' రజియ అన్న బండబూతులు తిడుతూ తలుపులు బాదుతున్నాడు - బయట చాలామంది చేరారని గోల తెలియచెపుతుంది - రజియాకి భయంతో చెమటలుపట్టాయి.

"ఏం పని చేశారుమీరు - యిప్పుడు యింక అన్న నన్ను బతకనీయడు - రజియా ఏడవసాగింది - కరిగిపోయాను - దగ్గరకి వెళ్ళి భుజంమీద చెయ్యివేశాను - రజియా ఉలిక్కిపడి కళ్ళెత్తిచూసింది.

"రజియా - నీకేం భయంలేదు - నేనున్నాను - నావెంట తీసికెడతాను.

"మీరు.... మీరెవరని నన్ను ఆదుకుంటారు - అంతా ఏం అంటారు? అన్నయ్యమాత్రం మీవెంట పంపడానికి ఎలా వప్పుకుంటాడు - మీకు నేనేం అవుతానని నామీద యింత దయ చూపిస్తారు - వద్దు వెళ్ళిపొండి - నా ఖర్మకి నన్ను వదలండి" అంటు ఏడవసాగింది- రజియా అలా ఏడుస్తుంటే సహించలేకపోయాను. రజియా భుజంమీదవున్న నా చెయ్యి నాకు తెలియకుండానే రజియా భుజాల చుట్టూ తిరిగి ఆమెని దగ్గరకి లాక్కుంది-" రజియా - యిటు చూడు - నీకు నేనేంకానా - నా కళ్ళలోకి చూచి చెప్పు ఆ మాట -" ఏంచేస్తున్నానో, ఏం అంటున్నానో తెలియని ఆవేశంతో రజియాని గుండెలకి హత్తుకుని రజియా నీవు నాకు కావాలి రజియా - నీవులేని లోకం నాకులేదు - నీకోసం ఏమన్నాచేస్తాను నిన్ను నరకంలో వదిలి నేనెలా నిశ్చింతగా వుంటాననుకున్నావు - పద ఇద్దరము వెళ్ళిపోదాం -" అన్నాను ఆవేశంగా - రజియా ఆశ్చర్య చకితురాలై " మీరు - మీరు" అంది. నా చేతులమధ్య వణికిపోతూ "అవును రజియా ఇన్నాళ్ళగా నా మనసులో మెదిలేమాట చెప్పే సందర్భం యిలా ఈ సందర్భంలో జత పడుతుందని అనుకోలేదు అంతే-నిన్ను పెళ్ళిచేసుకుంటాను రజియా" అన్నాను - రజియా కళ్ళనించి టపటప నీళ్ళు జారిపడ్డాయి అవి ఆనందబాష్పాలా! చటుక్కున నా గుండెలమీదకి వరిగిపోయింది! 'రజియా'. అదే సమయంలో తలుపు విరిగిపడింది - రజియా అన్న- యింట్లోవాళ్ళు - యిరుగు పొరుగు అంతా గుమ్మిగూడి, వాళ్ళందరూ మమ్మల్ని చూసి ఒక్కక్షణం నిశ్చేష్టులై వుండిపోయారు. రజియా అన్న తేరుకొని బుసలుకొడ్తు ముందుకు వురికాడు. ఎదుర్కోబోయే యుద్ధానికి సన్నిద్ధుణ్ణవుతూ రజియా భుజం చుట్టు చేయి వేశాను ధైర్యంచెప్తు-రజియా భయంతో వణికిపోతుంది. "బద్మాష్, ఫుండాకోర్ -